సాక్షి

# కీలకదశకు
# పాతబస్తీ మెట్రో విస్తరణ



- మొత్తం 886 ఆస్తుల కూల్చివేతకు చర్యలు
- ఇప్పటి వరకు 550 ఆస్తుల కూల్చివేత
- రూ.433 కోట్ల పరిహారం చెల్లించిన హెచ్ఎంఆర్

**సాక్షి, సిటీబ్యూరో:** పాతబస్తీ మెట్రో విస్తరణకు అవసరమైన పనులు వేగం పుంజుకొని కీలక దశకు చేరుకున్నాయి. కారిడార్ నిర్మాణానికి వీలుగా 'రైట్ ఆఫ్ వే'లభించే దశకు చేరువయ్యాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు 7.5 కి.మీ. పరిధిలో మెట్రో రైలు మార్గం నిర్మాణం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ కోసం 1,100 ఆస్తులను తొలగించే అవకాశం ఉన్నట్లు మొదట అంచనా వేశారు. కానీ, వాటి సంఖ్య 886కు తగ్గిందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు సుమారు 550 పైగా ఆస్తుల కూల్చివేతలు తుదిదశకు చేరుకున్నాయని చెప్పారు. ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులకు రు.433 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్లు పేర్కొన్నారు. వర్షాలు, పండుగలు, మొహర్రం వంటి వేడుకల సమయంలోనూ స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కేబుళ్ల తొలగింపు రోడ్డు విస్తరణ పనులకు సవాల్‌గా నిలిచినప్పటికీ, వాటిని అధిగమించి ముందుకు వెళ్తున్నామన్నారు.

## మెట్రో నిర్మాణానికి డీజీపీఎస్ సర్వే...

మెట్రో స్తంభాలు, స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక పనులను కూడా హెచ్ఏఎంఆర్ఎల్ చేపట్టింది. ఇందు కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్) సర్వే కొనసాగుతోంది. భూగర్భంలో ఉన్న మంచినీటి పైపులైన్లు, పారిశుధ్య పైపులైన్లు, కేబుళ్ల వంటి యుటిలిటీలను గుర్తించడంతోపాటు భూ సామర్థ్యం, మట్టి పరీక్షలు, అలైన్‌మెంట్ మార్గంలో ఉన్న సున్నితమైన కట్టడాల పరిరక్షణ వంటి ప్రధాన అంశాలపై అధికారులు దృష్టి సారించారు. 'ఇది అధునాతన సర్వే వ్యవస్థ. వేగవంతమైన బహుముఖ కోణంలో డిజిటల్ రూపంలో ఫలితాలను అందజేస్తుంది'అని అన్నారు. డీజీపీఎస్ డేటాను గతంలో చేసిన డ్రోన్ సర్వే డేటాతో అనుసంధానించినట్లు చెప్పారు.దీని వల్ల ప్రాజెక్ట్ అమలు మరింత వేగవంతమవుతుందన్నారు.

## వివిధ విభాగాలతో సమన్వయం...

- మొత్తం 7.5 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కొన్ని భాగాలుగా విభజించి అవసరమైన ప్రదేశాల్లో కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేశారు. హై–ప్రెసిషన్ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్స్ (జీఎన్ఎస్ఎస్) రిసీవర్‌లను నిర్దేశిత ప్రదేశాలను ఖచ్చితంగా నిర్ణయించడానికి వినియోగిస్తున్నట్లు ఎన్వీఎస్ వివరించారు.
- ఉపగ్రహాల నెట్‌వర్క్ సిగ్నళ్ల ఆధారంగా ఈ స్థానాలను ఖచ్చితంగా గుర్తించి మెట్రో పనుల సర్వే, మ్యాపింగ్‌లో వినియోగించనున్నారు.
- పాతబస్తీలో విస్తరించనున్న 100 అడుగుల రోడ్డు మార్గంలో అనేక నీటి సరఫరా లైన్లు, మురుగునీరు, వరద నీరు, విద్యుత్, టెలికాం లైన్లు వంటి యుటిలిటీలు ఉన్నాయి.
- మెట్రో స్తంభాలకు పునాదులను వేయడానికి ముందుగానే భూమిలోపల ఉన్న యుటిలిటీలను పక్కకు మళ్లించేందుకు జలమండలి, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ విభాగాల సహకారం కోరారు.
- యుటిలిటీలను గుర్తించడానికి గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేను చేపట్టారు. ఈ సర్వే వల్ల భూతలం కింద ఉన్న వస్తువులు, నిర్మాణాలను పసిగట్టవచ్చు.
- మెట్రో నిర్మాణానికిగాను భూసామర్థ్య పరీక్షలను కూడా హెచ్ఏఎంఆర్ఎల్ చేపట్టింది.
- మెట్రో పనులను సజావుగా కొనసాగించేందుకు 100 మీ. ఒకటి చొప్పున మైలు రాళ్లను ఏర్పాటు చేయనున్నారు. సున్నిత కట్టడాలకు విఘాతం లేకుండా జాగ్రత్తలు చేపట్టారు.
- ప్రస్తుతం కొనసాగుతున్న ఈ కీలకదశ పనులు పూర్తయిన వెంటనే మెట్రో నిర్మాణం ప్రారంభమవుతుందని ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.